క్లుప్తంగా

పారిశుద్ధ్య కార్మికుల సంక్షేమానికి చర్యలు

కంకిపాడు: పారిశుద్ధ్య కార్మికుల సంక్షేమానికి చర్యలు తీసుకుంటున్నట్లు ఈడుపుగల్లు సర్పంచ్ పి.ఇందిర తెలిపారు. జిల్లా పంచాయతీ అధికారి ఆదేశాలతో పారిశుద్ధ్య కార్మికులకు వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని శనివారం రెయిన్ కోట్లు పంపిణీ చేశారు. సర్పంచ్ ఇందిర మాట్లాడుతూ గ్రామంలో పారిశుద్ధ్య నిర్వహణలో ప్రతి ఒక్కరూ ముఖ్యపాత్ర వహించాలన్నారు. ప్రజారోగ్య పరిరక్షణలో భాగస్వాములు కావాలని కోరారు. వీధి దీపాలు, తాగునీటి సరఫరా, పారిశుద్ధ్య నిర్వహణ బాధ్యతలను సమర్థంగా నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి చింతా కిరణ్‌కుమార్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

గన్నవరం పీఎస్‌కు వచ్చిన మాజీ ఎమ్మెల్యే వంశీ



గన్నవరం: మాజీ ఎమ్మెల్యే డాక్టర్ వల్లభనేని వంశీమోహన్ శనివారం గన్నవరం పోలీస్‌స్టేషన్‌కు వచ్చారు. గన్నవరంలోని టీడీపీ ఆఫీస్‌పై దాడి కేసులో కోర్టు మంజూరు చేసిన బెయిల్ షరతుల మేరకు ఆయన పీఎస్‌లో సంతకం చేశారు. అనంతరం స్టేషన్ నుంచి బయటకు వచ్చిన వంశీమోహన్‌ను నియోజకవర్గంలోని వివిధ గ్రామాల వైఎస్సార్ సీపీ శ్రేణులు, అభిమానులు మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం వంశీమోహన్ విజయవాడ బయలుదేరివెళ్లారు.

రైతులు అందరికీ అందని అన్నదాత సుఖీభవ

పెనమలూరు: రైతులను అన్ని విధాల ఆదుకుంటామని చెప్పిన కూటమి ప్రభుత్వం అన్నదాత సుఖీభవ పథకాన్ని మండలంలో రైతులందరికి అమలు చేయలేదు. పెనమలూరు మండలంలో పొలం ఉన్న రైతులు 2,100 మంది ఉన్నారు. వీరు కాకుండా మరో 2,500 మంది వరకు కౌలు రైతులు ఉన్నారు. అయితే శనివారం విడుదల చేసిన అన్నదాత సుఖీభవలో 1,551 మంది రైతులు మాత్రమే అర్హత సాధించారు. పీఎం కిసాన్ పథకంలో 1,623 మంది ఉన్నారు. అంటే రెండు పథకాల్లో 72 మంది రైతులను వ్యత్యాసంగా చూపారు. ఇక మొత్తం రైతుల్లో అసలు పథకం అమలు కాని వారు 549 మంది రైతుల ఊసేలేకుండాపోయింది. కౌలు రైతుల పరిస్థితి ఏమిటో తెలుపలేదు. కాగా సీఎం చంద్రబాబునాయుడు అన్నదాత సుఖీభవ పథకం గత ఏడాది అమలు చేయలేదని, ఈ ఏడాది అనేక లోపాలతో అమలు చేస్తే రైతులకు ఏమి ఉపయోగమని అన్నదాతలు ప్రశ్నిస్తున్నారు.

టీచర్లకు సత్కారం



గన్నవరం: స్థానిక జెడ్పీ బాలికల హైస్కూల్‌లో శనివారం పుణ్య ఛారిటీస్, రోటరీ క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో 2024-25లో పదవ తరగతిలో ఉత్తమ ఫలితాల సాధనకు కృషి చేసిన ఉపాధ్యాయులకు అభినందన కార్యక్రమం నిర్వహించారు. ఉత్తమ ఫలితాలు సాధించిన పాఠశాల ఉపాధ్యాయులకు నూతన వస్త్రాలను అందజేసి సత్కరించారు. ఈ సందర్భంగా పుణ్య ఛారిటీస్ అధ్యక్షుడు, రోటేరియన్ జాస్తి విజయభూషణ్ కుమార్ మాట్లాడుతూ పదిలో అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు ప్రతియేటా తమ ఛారిటీస్ ద్వారా నగదు బహుమతులు అందజేస్తున్నట్లు తెలిపారు. విద్యార్థుల ఉత్తమ ఫలితాల సాధనకు కారకులైన ఉపాధ్యాయులను కూడా సత్కారించడం బాధ్యతగా భావిస్తున్నట్లు పేర్కొన్నారు. హెచ్ఎం డి. ఝాన్సీరాణి, రోటరీ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు జి.వి. రవిబాబు, కె. నాగరాజు, రోటేరియన్ నర్రా సీతారామారావు, గన్నె వెంకట్రావు, కోశాధికారి సురేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి పోరాటాలే మార్గం

గన్నవరం: సమస్యలు పరిష్కారం కావాలంటే సంఘటిత పోరాటాలే మార్గమని అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి ఎస్. రమాదేవి పేర్కొన్నారు. స్థానిక సీఐటీయూ కార్యాలయంలో శనివారం అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ గన్నవరం ప్రాజెక్ట్ కమిటీ మహాసభ నిర్వహించారు. ఈ సందర్భంగా రమాదేవి మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో అంగన్‌వాడీలకు అనేక హామీలను ఇచ్చిందని తెలిపారు. వాటిని సాధించుకునేందుకు సంఘటిత పోరాటాలు చేయాల్సిన అవసరం ఉందన్నారు. అంగన్‌వాడీలకు పెరిగిన పని భారానికి అనుగుణంగా ప్రభుత్వం వేతనాలను పెంచడం లేదన్నారు. కొన్నిచోట్ల అంగన్‌వాడీలు రాజకీయ వేధింపులకు గురవుతున్నారని పేర్కొన్నారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు కళ్లం వెంకటేశ్వరరావు, బెజవాడ తాతబ్బాయి, కడవకొల్లు రామారాజు తదితరులు పాల్గొన్నారు.

పంట పొలాల్లోకి కార్పొరేట్ వ్యర్థాలు

- పొలాల భూసారం దెబ్బతింటుందని రైతుల ఆందోళన
- ఎస్టీపీ ప్లాంట్లు ఉన్నా ఫలితం శూన్యం
- కార్పొరేట్ కళాశాలలకు కొమ్ము కాస్తున్న అధికారులు



జాతీయ రహదారి వెంబడి డొంకలో నిలిచిన మురుగు

రామవరప్పాడు: విజయవాడరూరల్ మండలం నిడమానూరు జాతీయ రహదారికి ఆనుకుని ఉన్న పలు కార్పొరేట్ కళాశాలలు, పాఠశాలల వ్యర్థాలు ఏళ్ల తరబడి సమీప పంట పొలాల్లోకి వదలడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నిబంధనలకు విరుద్ధంగా ఈ కళాశాలల యాజమాన్యాలు మురుగు, మెస్ వ్యర్థాలు నేరుగా పంట పొలాల్లోకి వదులుతున్నారు. ఫలితంగా తమ పంటలు పండటం లేదని, పొలాలు నాశనం అవుతున్నాయని రైతులు ఆవేదన చెందుతున్నారు. కానీ ఇవేమీ పట్టని కళాశాలల యాజమాన్యాలు ఇష్టానుసారంగా వ్యర్థాలను వదిలేస్తున్నారు. కళాశాలల్లో ఎస్టీపీ ప్లాంటు ఉన్న అలంకారప్రాయంగా మారాయి. వీటి నిర్వహణ ఖర్చులు తగ్గించుకునేందుకు ఇటువంటి చర్యలకు పాల్పడుతున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. ఎన్నో ఏళ్ల నుంచి రైతులు తమ పంట పొలాలను రక్షించాలని అధికారులకు మొరపెట్టుకుంటున్నా ఇప్పటివరకు ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదని రైతులు వాపోతున్నారు. పైగా పంచాయతీ, ఇరిగేషన్ అధికారులు కళాశాలల యాజమాన్యాలకు అనుకూలంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. జాతీయ రహదారి సమీపంలో పంచాయతీ రాజ్‌కు చెందిన డొంక ఉంది. మురుగును ఈ డొంక నుంచి బుడమేరులోకి మళ్లించే నిమిత్తం గతంలో డ్రెయిన్ తవ్వేందుకు అధికారులు అనుమతులు లేకుండా పలుమార్లు ప్రయత్నించారు. అప్పట్లో ఈ చర్యలను రైతులు తీవ్రంగా వ్యతిరేకించడంతో పనులను నిలిపివేశారు. కళాశాలల నుంచి వచ్చే వ్యర్థాలను ఈ డ్రెయిన్ ద్వారా బుడమేరులో కలుపుతామని చెబుతున్నారని ఇది సాధ్యం కాని ప్రక్రియని రైతులు అంటున్నారు. బుడమేరులో కలిసే చోట డ్రెయిన్ మార్గం ఎత్తులో ఉందని ఇలా ఉంటే ఎలా కలుపుతారని ప్రశ్నిస్తున్నారు. వర్షాకాలంలో డ్రెయిన్ పొంగితే మురుగు మరలా పొలాలపైకి వచ్చి చేరుతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అండర్‌గ్రౌండ్ చానల్‌ను ఏర్పాటు చేసుకోవాలి...

వెలువడుతున్న వ్యర్థాల వల్ల ఎవ్వరికీ ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా అండర్‌గ్రౌండ్ చానల్‌ను కళాశాలల యాజమాన్యాలు ఏర్పాటు చేసుకోవాలని పలువురు రైతులు డిమాండ్ చేస్తున్నారు. సొంత ఖర్చులతో కళాశాలల నుంచి వస్తున్న వ్యర్థాలను పైప్‌ల ద్వారా భూగర్భ మార్గంలో బుడమేరులో కలుపుకొంటే ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని చెబుతున్నారు. కాగా ఇది ఖర్చుతో కూడుకున్న వ్యవహారమని దీనికి కళాశాలల యాజమాన్యాలు అంగీకరించడంలేదని చెబుతున్నారు. కళాశాల యాజమాన్యాలకు అనుకూలంగా పంచాయతీ, ఇరిగేషన్ అధికారులు వ్యవహరిస్తూ రైతులకు నష్టం కలుగజేస్తున్నారని ఆరోపిస్తున్నారు. కళాశాలలో ఉన్న ఎస్టీపీ ప్లాంటుకు కూడా విద్యుత్ ఖర్చులు ఆదా చేసేందుకు నిర్వహించడంలేదని చెబుతున్నారు. ఉన్నతాధికారులు ఈ సమస్యపై స్పందించి చర్యలు తీసుకుని ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

ఘనంగా పింగళి వెంకయ్య జయంతి



కానూరులో పింగళి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న బాడీ బిల్డింగ్ క్రీడాకారులు



గన్నవరంలో పింగళి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ప్రిన్సిపాల్, విద్యార్థులు

పెనమలూరు: జాతీయ జెండా రూపశిల్పి పింగళి వెంకయ్య జయంతిని కానూరు అశోక్ జిమ్‌లో శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పింగళి వెంకయ్య చిత్రపటానికి గన్నవరం ట్రాఫిక్ సీఐ పెద్దిరాజు పూలమాలలు వేసి నివాళులర్పించారు. స్వాతంత్య్ర సమరయోధుడు పింగళి కృష్ణా జిల్లా వాసని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా బాడీబిల్డింగ్ అసోసియేషన్ కార్యదర్శి తాళ్లూరి అశోక్, యూత్ ఆఫీసర్ రఘురామ్, సీపీవో నాగేశ్వరరావు, బాడీ బిల్డింగ్ క్రీడాకారులు పాల్గొన్నారు.

క్విజ్ పోటీలు

గన్నవరం: స్థానిక స్రవంతి హైస్కూల్‌లో శనివారం పింగళి వెంకయ్య జయంతిని పురస్కరించుకుని క్విజ్ పోటీలను నిర్వహించారు. తొలుత పింగళి చిత్రపటానికి హైస్కూల్ ప్రిన్సిపాల్ కొమ్మినేని రామకృష్ణ, జిల్లా సైన్స్ మాజీ కోఆర్డినేటర్ కె.మాణిక్యాలరావు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం 8, 9, 10 తరగతి విద్యార్థులకు క్విజ్ పోటీలను నిర్వహించారు. ఈ పోటీల్లో విజేతలకు ఈనెల 15న బహుమతులు ప్రదానం చేయనున్నట్లు తెలిపారు. క్విజ్ మాస్టర్ జి.నరసింహారావు, శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గన్నవరం రూరల్: మండలంలోని ముస్తాబాద నవభారత్ హైస్కూల్‌లో శనివారం పింగళి వెంకయ్య జయంతి నిర్వహించారు. కరస్పాండెంట్ షేక్ ఇమాం ఆధ్వర్యంలో వెంకయ్య జీవిత విశేషాలు విద్యార్థులకు వివరించారు. ప్రిన్సిపాల్ షేక్ జాకీరా సుల్తానా, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రేపు అయ్యప్పస్వామి ఆలయానికి శంకుస్థాపన

పెనమలూరు: పెనమలూరు గ్రామంలో అయ్యప్ప స్వామివారి నూతన దేవాలయ శంకుస్థాపన మహోత్సవం ఈ నెల 4వ తేదీన నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ శనివారం ఒక ప్రకటనలో తెలిపింది. పెనమలూరు వంతెన డౌన్‌లో సోమవారం ఉదయం 8.14 గంటలకు ఆలయ శంకుస్థాపన చేయనున్నట్లు పేర్కొంది. ఈ కార్యక్రమానికి భక్తులు పెద్ద ఎత్తున హాజరుకావాలని అయ్యప్పస్వామి భక్త బృందం కోరింది.

యూరియా కొరత నివారించాలి

కంకిపాడు: ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో నెలకొన్న యూరియా కొరతను నివారించాలని కౌలురైతు సంఘం మండల నేత తాడంకి నరేష్ డిమాండ్ చేశారు. పట్టణంలోని మండే పూడి భవన్‌లో కౌలురైతు సంఘం ఆధ్వర్యంలో శనివారం విలేకరుల సమావేశం నిర్వహించారు. నరేష్ మాట్లాడుతూ పీఏసీఎస్‌లలో యూరియా అందుబాటులో లేకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. సొసైటీలు, రైతు సేవా కేంద్రాల ద్వారా రైతులకు అవసరమైన యూరియాను సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. ప్రైవేటు వ్యాపారులు సాగిస్తున్న దోపిడీ చర్యలకు అడ్డుకట్ట వేయాలని, వ్యవసాయశాఖ నిర్లక్ష్య వైఖరిని విడనాడాలని విజ్ఞప్తిచేశారు. కార్యక్రమంలో రైతుసంఘం నేతలు శివశంకర్‌రావు, వి.మరియదాసు తదితరులు పాల్గొన్నారు.

రైతులు యాంత్రీకరణపై దృష్టి సారించాలి

జిల్లా ఇన్‌చార్జి మంత్రి వాసంశెట్టి సుభాష్



కంకిపాడులో అన్నదాత సుఖీభవ చెక్కు అందజేస్తున్న మంత్రి వాసంశెట్టి సుభాష్

కంకిపాడు: రైతులు యాంత్రీకరణపై దృష్టిసారించాలని జిల్లా ఇన్‌చార్జి మంత్రి వాసంశెట్టి సుభాష్ పేర్కొన్నారు. కంకిపాడు మార్కెట్‌యార్డు కార్యాలయ ప్రాంగణంలో అన్నదాత సుఖీభవ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. కార్యక్రమానికి ఎమ్మెల్యేలు బోడె ప్రసాద్, గద్దె రామ్మోహన్‌రావుతో కలిసి మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి సుభాష్ మాట్లాడుతూ వ్యవసాయం సులభతరంగా చేసుకునేందుకు డ్రోన్‌లను అందుబాటులోకి తెచ్చామన్నారు. అర్హత ఉన్న రైతులకు అన్నదాత సుఖీభవ సొమ్మును ప్రభుత్వం అందజేస్తుందని తెలిపారు. బిందు సేద్యంపై అవగాహన పెంచుకోవాలని, సబ్సిడీలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఆర్డీఓ హెలా షారోన్, జిల్లా వ్యవసాయాధికారి మనోహర్‌రావు, ఏఎంసీ చైర్మన్‌లు అన్నే ధనయ్య, కొండా ప్రవీణ్‌కుమార్, పలువురు అధికారులు పాల్గొన్నారు.

నున్నలో అన్నదాత సుఖీభవ

నున్న(విజయవాడరూరల్): విజయవాడ రూరల్ మండలం నున్న గ్రామంలో శనివారం అన్నదాత సుఖీభవ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావ్ మాట్లాడుతూ రైతులకు ఖరీఫ్ పెట్టుబడి సాయంగా ప్రభుత్వం ఆర్థిక సాయం అందజేసిందని తెలిపారు. సాంకేతిక కారణాల వల్ల కొందరు రైతులు అనర్హులుగా ఉన్నారని తెలిపారు. తహసీల్దారు ప్రత్యేక చర్యలు తీసుకుని తప్పులు సరిచేసి అర్హులైన రైతులందరికి పంట సాయం అందేలా చూడాలన్నారు. ఆత్మ పీడీ మాధవీలత, ఏపీసీఎన్ఎఫ్ ప్రాజెక్ట్ మేనేజర్ శంకర్‌నాయక్, డీసీసీ ఆళ్ల గోపాలకృష్ణ, రూరల్ తహసీల్దారు బి.సుగుణ, ఎంపీడీఓ బి.విగ్గీన్స్, వ్యవసాయాధికారి కె.రఘురామ్, ఉద్యానశాఖాధికారి పరమేశ్వరరెడ్డి, సొసైటీ అధ్యక్షుడు కె.శ్రీనివాసరెడ్డి, సొసైటీ డైరెక్టర్లు పాల్గొన్నారు.

వృద్ధులకు నేత్ర సంరక్షణ కేంద్రం ప్రారంభం



పెనమలూరు: తాడిగడప ఎల్‌వీ ప్రసాద్ నేత్ర వైద్యశాలలో వృద్ధులకు నేత్ర సంరక్షణ కేంద్రాన్ని శనివారం ప్రారంభించారు. డాక్టర్ కేవీ ప్రసాద్, కే సూర్యనారాయణమ్మ పేర ఏర్పాటు నేత్ర సంరక్షణ కేంద్రాన్ని సంధ్యా మెరేన్స్ యజమాని కె.ఆనంద్‌కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆస్పత్రి హెడ్ డాక్టర్ అనసువాకపూర్ మాట్లాడుతూ వృద్ధుల నేత్ర సేవా సంరక్షణ కేంద్రం సంధ్యా మెరేన్స్ సహకారంతో సామాజిక సేవలో భాగంగా ఏర్పాటు చేశామన్నారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ మార్గదర్శకాల ప్రకారం వృద్ధులకు సానుకూలమైన వసతులు, శిక్షణ పొందిన నిపుణులు, టెలీకన్సల్‌టేషన్, ఇంటి వద్దే స్క్రీనింగ్ సేవలు అందుబాటులో ఉంటాయన్నారు. వేగంగా పెరుగుతున్న వృద్ధుల జనాభా సంఖ్యకు అనుగుణంగా సేవలు అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో విశ్రాంత ఐఏఎస్ కాసరనేని దమయంతి, ఎల్‌వీపీఐ వ్యవస్థాపక చైర్మన్ డాక్టర్ జీఎన్ రావు, వృద్ధుల సంరక్షణ కేంద్రం ఇన్‌చార్జి డాక్టర్ అవినాష్ తదితరులు పాల్గొన్నారు.

రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలి



విజయశేఖర్‌ను పరామర్శిస్తున్న దేవభక్తుని చక్రవర్తి

కంకిపాడు: రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించాలని వైఎస్సార్ సీపీ పెనమలూరు నియోజకవర్గ సమన్వయకర్త దేవభక్తుని చక్రవర్తి సూచించారు. విద్యుదాఘాతానికి గురై కంకిపాడు సీహెచ్‌సీలో చికిత్స పొందుతున్న గొడవర్రు వాసి బొడ్డు విజయశేఖర్‌ను శనివారం ఆయన పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితి అడిగి తెలుసుకున్నారు. మెరుగైన వైద్యసేవలకు అవసరమైన సహాయ సహకారాలు అందిస్తానని హామీ ఇచ్చారు. అనంతరం స్థానిక ఆసుపత్రిలో వైద్యం పొందుతున్న రోగుల క్షేమ సమాచారం, వైద్య సేవలపై ఆరా తీశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు బాకీ బాబు, పార్టీ మండల అధ్యక్షురాలు మాదు శ్రీహరిరాణి, సర్పంచ్‌లు మేరుగు విజయచంద్రశేఖర్, పిన్నబోయిన శ్రీనివాసరావు, బాయిరెడ్డి నాగరాజు, నాయకులు కాగిత రాజారమేష్, చుండూరు మోహన్‌రావు, మాదు రాఘవేంద్రరావు, ఉప్పులేటి శ్రీనివాసరావు, కైలే నాగేంద్రబాబు, మాదు రామారావు, మావులూరి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఔషధ రంగంలో నూతన పరిశోధనలు



విద్యార్థులకు పతకాలు అందజేస్తున్న సురేష్ తదితరులు

రామవరప్పాడు: మానవాళికి ఉపయోగపడే ఔషధాల తయారీ రంగంలో నూతన పరిశోధనలు జరుగుతున్నాయని డాక్టర్ సురేష్ చిన్నపాటి తెలిపారు. విజయవాడరూరల్ మండలం ఎనికేపాడు విజయ ఫార్మసీ కళాశాలలో అసోసియేషన్ ఫార్మసీ ప్రొఫెషనల్ ఆధ్వర్యంలో 'ఔషధ రంగంలో కృత్రిమ మేధస్సు' అంశంపై జరుగుతున్న సదస్సు శనివారంతో ముగిసింది. ఈ సందర్భంగా సురేష్ మాట్లాడుతూ ఫార్మసీ విద్యార్థులు ఎప్పటికప్పుడు మారుతున్న సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుని నూతన పరిశోధనలు చేయాలని సూచించారు. అనంతరం శాస్త్రీయ ప్రదర్శనలో ఉత్తమ ప్రతిభను కనబర్చిన విద్యార్థులు, అధ్యాపకులకు ధ్రువపత్రాలు, పతకాలను అందజేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ కె.పద్మలత, గౌరవ్ గుప్తా, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వాణిశ్రీ నటన భావి నటీమణులకు ఆదర్శం



విజయవాడ కల్చరల్: సినీ నటి వాణిశ్రీ నటన భావి నటీమణులకు ఆదర్శమని మహానటి సావిత్రి సంక్షేమ సంఘం వ్యవస్థాపకురాలు పరుచూరి విజయలక్ష్మి అన్నారు. మహానటి సావిత్రి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో గాంధీనగర్‌లోని హనుమంతరాయ గ్రంథాలయంలో వాణిశ్రీ జన్మదిన వేడుకలు, సినీ సంగీత విభావరి కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. విజయలక్ష్మి మాట్లాడుతూ స్వయంకృషితో ఉన్నత శిఖరాలకు చేరుకున్న నటి వాణిశ్రీ అన్నారు. సావిత్రి కళాపీఠం నిర్వహించిన అనేక కార్యక్రమాల్లో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారన్నారు. జ్యోతిష్య శాస్త్రవేత్త ప్రసూనా రామన్ మాట్లాడుతూ.. సావిత్రి నట వారసత్వాన్ని అందుకున్న నటి వాణిశ్రీ అని గుర్తు చేశారు. కార్యక్రమంలో వివిధ సంస్థల ప్రతినిధులు చింతకాయల చిట్టిబాబు, డేవిడ్‌రాజు, బీవీ వీరభద్రరావు, ప్రభల శ్రీనివాస్, కొప్పరపు బలరామకృష్ణమూర్తి, చావా నరసింహారావు తదితరులు పాల్గొన్నారు. వాణిశ్రీ నటించిన చిత్రాల్లోని పాటలను గాయనీ గాయకులు ఆలపించారు.

తల్లిపాలతోనే బిడ్డకు ఆరోగ్యం



కానూరు అంగన్‌వాడీ కేంద్రంలో మాట్లాడుతున్న సీడీపీవో బేబీసుకన్య



ఉప్పలూరులో బ్రోచర్ ఆవిష్కరిస్తున్న సర్పంచ్ సోనియా, ఐసీడీఎస్ సిబ్బంది

పెనమలూరు: తల్లిపాలతోనే బిడ్డ ఆరోగ్యంగా ఎదుగుతారని ఐసీడీఎస్ సీడీపీవో బేబీసుకన్య పేర్కొన్నారు. తాడిగడప మున్సిపాలిటీ పరిధి కానూరు గుమ్మడితోట అంగన్‌వాడీ కేంద్రంలో ప్రపంచ తల్లిపాల వారోత్సవాలను శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బిడ్డ పుట్టిన తర్వాత అరగంటలోపే తల్లి ముర్రపాలు బిడ్డకు ఇవ్వాలని సూచించారు. దీని వల్ల బిడ్డకు రోగనిరోధక శక్తి పెరుగుతుందని తెలిపారు. తల్లిపాల ఆవశ్యకతపై అంగన్‌వాడీ కార్యకర్తలు తల్లులు, గర్భిణీలకు అవగాహన కల్పించాలని సూచించారు. సూపర్‌వైజర్ జి.విజయలక్ష్మి, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు. తాడిగడప -1 అంగన్‌వాడీలో సూపర్‌వైజర్ శ్రీలత తల్లిపాల లాభాలు వివరించారు. ఏఎన్ఎం జిమ్మివిక్టర్, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశవర్కర్లు, తల్లులు పాల్గొన్నారు. అలాగే యనమలకుదురు-2,13 అంగన్‌వాడీ కేంద్రాల్లో జరిగిన కార్యక్రమంలో సూపర్‌వైజర్ ఎం.కల్యాణి వర్మ, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు. పోరంకిలో జరిగిన కార్యక్రమంలో డాక్టర్ మాధురి మాట్లాడుతూ తల్లిపాలు బిడ్డ ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయని తెలిపారు. గోసాల గ్రామంలోనూ తల్లిపాల వారోత్సవాలు చేశారు.

తల్లిపాలతో వ్యాధి నిరోధకశక్తి వృద్ధి

కంకిపాడు: తల్లిపాలతో వ్యాధి నిరోధకశక్తి పెంపొందుతుందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ షేక్ రెహానా బేగం అన్నారు. ఉప్పలూరు గ్రామంలో తల్లిపాల వారోత్సవాలు శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా తల్లిపాల ఆవశ్యకతను వివరించే బ్రోచర్‌ను ఆవిష్కరించారు. రెహానాబేగం మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తల్లిపాల ఆవశ్యకతపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ లాం సోనియా, ఐసీడీఎస్ సిబ్బంది ఎన్.జాస్మిన్, ఎల్.సుభాషిణి, బి.నాగమణి, కె.స్వర్ణలత, ఏఎన్ఎం భవానీ, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉయ్యూరు/ఉయ్యూరురూరల్: ఉయ్యూరు మున్సిపాలిటీ, మండలంలోని పలు గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో తల్లిపాల వారోత్సవాలు కొనసాగుతున్నాయి. తల్లిపాల ఆవశ్యకతను వివరించారు. పెద ఓగిరాల కార్యక్రమంలో సర్పంచ్ త్రిపురం లక్ష్మి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ బేబి సరోజిని పాల్గొన్నారు.

5న స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా ధర్నాలు



ప్రొద్దుటూరులో కరపత్రాలు పంపిణీ చేస్తున్న ప్రజావేదిక ప్రతినిధులు

గన్నవరం: స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా ఈ నెల 5న విద్యుత్ శాఖ కార్యాలయాల వద్ద జరిగే ధర్నాలను జయప్రదం చేయాలని ప్రజావేదిక నాయకులు పిలుపునిచ్చారు. విద్యుత్ స్మార్ట్ మీటర్లను ఎత్తివేయాలని డిమాండ్ చేస్తూ శనివారం ప్రజావేదిక నాయకులు గన్నవరంలో విస్తృత ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా సంతకాలు సేకరణ చేశారు. ప్రజావేదిక నేతలు కె. వెంకటేశ్వరరావు, కె. రామచంద్రజోషి మాట్లాడుతూ.. విద్యుత్ చార్జీలు తగ్గిస్తామని ఎన్నికల్లో ఇచ్చిన హామీని కూటమి ప్రభుత్వం విస్మరించిందన్నారు. ఏడాదిలోనే ఇష్టారాజ్యంగా విద్యుత్ ఛార్జీలను పెంచి ప్రజలపై పెనుభారాలు మోపిందన్నారు. ఇప్పుడు స్మార్ట్ మీటర్ల పేరుతో అదనపు దోపిడీకి ప్రభుత్వం తెరతీసిందని ఆరోపించారు. ప్రజావేదిక నేతలు మల్లంపల్లి అంజనేయులు, అనుమోలు వెంకటేశ్వరరావు, విజయరావు, సూరగాని సాంబశివరావు, చాగంటిపాటి వెంకటేశ్వరరావు, మిరప నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ప్రొద్దుటూరులో..

కంకిపాడు: మండలంలోని ప్రొద్దుటూరు గ్రామంలో స్మార్ట్ మీటర్లు రద్దు చేయాలని, ట్రూ అప్ చార్జీలు ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ ప్రజావేదిక నాయకుడు టి.నరేష్ కరపత్రాలు పంపిణీ చేశారు. నరేష్ మాట్లాడుతూ స్మార్ట్ మీటర్లను రద్దు చేసే వరకు ఉద్యమం కొనసాగుతుందని స్పష్టంచేశారు. కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు వి.శివశంకర్, ఈడా కోటేశ్వరరావు, వై. బుల్లియ్య, వేణు పాల్గొన్నారు.

రేపటి నుంచి దంత వైద్యంపై ఎగ్జిబిషన్

గన్నవరం రూరల్: సిద్ధార్థ అకాడమీ స్వర్ణ ఉత్సవాల సందర్భంగా చిన అవుటపల్లి డాక్టర్ సుధా అండ్ నాగేశ్వరరావు సిద్ధార్థ డెంటల్ కళాశాలలో ఈ నెల నాలుగు నుంచి 11 వరకు ఆధునిక మెడికల్, డెంటల్ వైద్యంపై అవగాహన ఎగ్జిబిషన్ నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ ఎంవీ రామోజీరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. దంత వైద్య విభాగాల్లో కళాశాలలో లభించే ఆధునిక దంత వైద్య సేవలు, పరికరాలు ప్రదర్శిస్తారని చెప్పారు.

పిన్నమనేని సిద్ధార్థ మెడికల్ కళాశాలలో..

మండలంలోని చిన అవుటపల్లి డాక్టర్ పిన్నమనేని సిద్ధార్థ మెడికల్ కళాశాలలో ఈ నెల 4న మెడికల్ అండ్ హెల్త్ ఎగ్జిబిషన్‌ను ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు ప్రారంభిస్తారని ప్రిన్సిపాల్ డాక్టర్ ఎంవీ భీమేశ్వర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆధునిక వైద్యంపై అవగాహన కల్పించేందుకు ఈ ఎగ్జిబిషన్ ఏర్పాటు చేసినట్లు ఆయన పేర్కొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన

గన్నవరం: విద్యార్థి దశ నుంచే ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన పెంచుకోవాలని గన్నవరం ట్రాఫిక్ సీఐ పెద్దిరాజు సూచించారు. స్థానిక రవీంద్ర భారతి స్కూల్‌లో శనివారం ట్రాఫిక్ నిబంధనలపై విద్యార్థులకు అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా పెద్దిరాజు మాట్లాడుతూ.. రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతిఒక్కరూ విధిగా ట్రాఫిక్ రూల్స్‌ను పాటించాలని సూచించారు. డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలు నడపడం చట్టరీత్యా నేరమని పేర్కొన్నారు. పలువురు ట్రాఫిక్ సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సోదరిపై సోదరుడు దాడి

పెనమలూరు: కానూరులో కుటుంబ తగాదా కారణంగా సోదరిపై సోదరుడు దాడి చేయడంతో పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు. పెనమలూరు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కానూరు టీచర్స్ కాలనీకి చెందిన ఎ.జయప్రదకు ఆమె సోదరుడు(అన్న) లంకపల్లి సామియేలుతో కుటుంబ తగాదాలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో జయప్రద ఇంటికి సామియేలు వచ్చి తగాదాపడి ఆమెపై దాడి చేశాడు. ఈ ఘటనలో గాయపడిన జయప్రద విజయవాడ ప్రభుత్వాస్పత్రిలో చికిత్సకై చేరింది. బాధితురాలి ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

పెనమలూరు: పోరంకి పరిధి విజయవాడ - మచిలీపట్నం జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు అవడంతో పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు. పెనమలూరు సీఐ వెంకటరమణ కథనం మేరకు.. పోరంకికి చెందిన రమణయ్య కూలీ పనులు చేస్తాడు. అతను శుక్రవారం సాయంత్రం ద్వారకా కల్యాణ మండపం వద్ద బందరు రోడ్డు దాటుతుండగా మచిలీపట్నం నుంచి విజయవాడ వైపునకు వస్తున్న కారు రమణయ్యను ఢీ కొట్టింది. ఈ ఘటనలో రమణయ్య రోడ్డుపై పడిపోవడంతో రక్తం గాయాలు అవ్వగా విజయవాడ ప్రభుత్వాస్పత్రిలో చేర్చారు. బాధితుడి ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు.